సాక్షి విశాఖపట్నం

శుక్రవారం, 12, మే 2023



నాడు నేడు.. యమస్పీడ్!

ప్రభుత్వ పాఠశాలలు రూపురేఖలు మార్చేలా నాడు–నేడు కింద చేపడుతున్న అభివృద్ధి పనుల్లో వేగం పెంచేలా ఫోకస్ పెట్టారు. IIలో



వైద్య విద్యార్థుల మౌన దీక్ష

కేరళలో వైద్యుల సమ్మెకు మద్దతుగా, వైద్యురాలు వందనా దాస్ మృతికి సంతాపంగా వైద్య విద్యార్థులు మౌన దీక్ష చేపట్టారు. IIలో



దేశీయంగా క్షిపణుల తయారీ

ఎన్ఎస్టీఎల్‌లో మూడు రోజులుగా జరుగుతున్న సాంకేతిక దినోత్సవం గురువారంతో ఘనంగా ముగిసింది. IIలో

న్యూస్‌రీల్

స్టీల్‌ప్లాంట్ నూతన డైరెక్టర్ బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న పాండే

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ నూతన డైరెక్టర్(పర్సనల్)గా డాక్టర్ సురేష్ చంద్ర పాండే గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతవరకు ఆయన సెయిల్ సేలం యూనిట్ చీఫ్ జనరల్ మేనేజర్(పీఅండ్ఏ)గా విధులు నిర్వర్తించారు. రాంచీ యూనివర్సిటీలో కామర్స్, ఎల్ఎల్‌బీలో గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన పాండే 1989లో సెయిల్‌లో చేరారు. బుద్ధ గయలోని మగధ్ విశ్వవిద్యాలయంలో ఎంబీఏ పూర్తి చేసిన తర్వాత ఆయన పర్సనల్ మేనేజ్‌మెంట్‌లో పీహెచ్‌డీ పొందారు. పాండే బాధ్యతలు స్వీకరించిన అనంతరం సీఎండీ అతుల్ భట్, ఇతర డైరెక్టర్లను మర్యాదపూర్వకంగా కలిశారు.

ఐటీఐలో ప్రవేశాలకు దరఖాస్తులు

కంచరపాలెం(విశాఖ ఉత్తర): విశాఖ జిల్లాలోని ప్రభుత్వ/ప్రైవేట్ ఐటీఐల్లో 2023–24 విద్యా సంవత్సరంలో ప్రవేశాల కోసం దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు ప్రభుత్వ ఐటీఐల ప్రిన్సిపాల్ జె.శ్రీకాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. iti.ap.gov.in వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. అన్ని ప్రభుత్వ , ప్రైవేటు ఐటీఐలకు ఒక దరఖాస్తు సరిపోతుందని పేర్కొన్నారు. నమోదు అనంతరం విద్యార్థులు తమ దగ్గరలోని ప్రభుత్వ ఐటీఐలో సర్టిఫికెట్లు వెరిఫై చేయించుకోవాలని తెలిపారు. స్టీల్‌ప్లాంట్ ఆర్ కార్డుకు సంబంధించిన అభ్యర్థులు ప్రత్యేక కేటగిరిలో దరఖాస్తు చేసుకుని, విధిగా వెరిఫికేషన్ చేయించుకోవాలని తెలియజేశారు. ప్రభుత్వ ఐటీఐ(ఓల్డ్) కంచరపాలెం, ప్రభుత్వ ఐటీఐ(బాలికలు) - ఇండస్ట్రియల్ ఎస్టేట్, ప్రభుత్వ ఐటీఐ(కొత్తది)–గాజువాక, ప్రభుత్వ ఐటీఐ–నరవ కళాశాలల్లో ఏదో ఒకచోట వెరిఫికేషన్ చేయించుకుని, కౌన్సెలింగ్‌కు అర్హత పొందాలని సూచించారు. మే 12వ తేదీ నుంచి జూన్ 6వ తేదీలోగా ఈ ప్రక్రియ పూర్తి చేయాలని వివరించారు.

నేటి నుంచి పాలిటెక్నిక్ వార్షిక పరీక్షలు

మురళీనగర్: పాలిటెక్నిక్ విద్యార్థులకు వార్షిక పరీక్షలు శుక్రవారం నుంచి నిర్వహిస్తామని కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణ తెలిపారు. పరీక్షలు ఈనెల 27వ తేదీ వరకు నిర్వహిస్తారు. సీ–20 సిలబస్‌కు సంబంధించి ఫస్టియర్ వార్షిక పరీక్షలతోపాటు సెకండియర్ థర్డ్ సెమిస్టర్ సప్లిమెంటరీ, ఫోర్త్ సెమిస్టర్ రెగ్యులర్, సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహిస్తామన్నారు. ఉదయం పరీక్ష 9.30 గంటల నుంచి 12.30గంటలకు, మధ్యాహ్నం పరీక్ష రెండు గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు నిర్వహిస్తారు.

డి.వి.సూర్యారావుకు చందు ట్రస్ట్ సాహిత్య పురస్కారం

సీతంపేట: ఆచార్య చందు సుబ్బారావు సాహితీ సాంస్కృతిక సంస్థ 2023 సాహిత్య పురస్కారాన్ని ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ డి.వి.సూర్యారావుకు అందజేయనున్నట్టు ప్రకటించింది. ఈ నెల18వ తేదీ సాయంత్రం ఆరు గంటలకు ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో ట్రస్ట్ 7వ వార్షికోత్సవం జరగనుంది. ఈ సభలో ఆయనకు పురస్కారం ప్రదానం చేయనున్నారు.

పలు రైళ్లు ఆలస్యం

తాటిచెట్లపాలెం: చెన్నైలో గురువారం రాత్రి 7.15 గంటలకు బయలుదేరాల్సిన చెన్నై సెంట్రల్–హౌరా(12840) మెయిల్ రెండున్నర గంటలు ఆలస్యంగా రాత్రి 9.45 గంటలకు బయలుదేరింది. విశాఖపట్నంలో మధ్యాహ్నం 2 గంటలకు బయలుదేరాల్సిన విశాఖపట్నం–కడప(17488) తిరుమల ఎక్స్‌ప్రెస్ రెండు గంటలు ఆలస్యంగా సాయంత్రం 4 గంటలకు బయలుదేరింది. పెయిరింగ్ రైళ్లు ఆలస్యంగా చేరుకోవడంతోనే ఈ పరిస్థితి ఏర్పడిందని రైల్వే అధికారులు తెలిపారు.

నేడే మాధవుడికి తొలి చందనోత్సవం

పద్మనాభం: పద్మనాభంలో వెలసిన కుంతీ మాధవస్వామి చందనోత్సవం శుక్రవారం నిర్వహించేందుకు ఆలయ వర్గాలు ఏర్పాట్లు పూర్తి చేశాయి. స్వామికి చందోత్సవం నిర్వహించడం ఇదే తొలిసారి. ఇందుకోసం 20 కిలోల చందనం సిద్ధం చేశారు. అర్ధరాత్రి దాటిన తర్వాత ఒంటి గంట నుంచి స్వామికి చందనం పూస్తారు. నిత్య పూజల అనంతరం స్వామి చందనం అలంకరణలో ఉదయం ఆరు గంటల నుంచి భక్తులకు దర్శనమిస్తారు.

విశ్వ విశాఖే లక్ష్యంగా..



వైఎస్సార్ స్టేడియంలో సంతకం చేస్తున్న సీఎం జగన్

- రూ.49 కోట్ల విలువైన ప్రాజెక్టులు ప్రారంభించిన సీఎం జగన్
- రూ.24.86 కోట్లతో భీమిలి ఫిషింగ్ జెట్టీకి శంకుస్థాపన
- మహానేత వైఎస్సార్ విగ్రహావిష్కరణ
- అపోలో ఆస్పత్రిలో అత్యాధునిక క్యాన్సర్ సేవలు ప్రారంభం
- సీఎం జగన్‌కు ఘన స్వాగతం పలికిన నగరవాసులు



వైఎస్సార్ స్టేడియంలో ఫొటోగ్యాలరీని పరిశీలిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి



సీ హారియర్ యుద్ధ విమాన మ్యూజియంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి

సాక్షి, విశాఖపట్నం/విశాఖ స్పోర్ట్స్: మహా నగరానికి ఉజ్వల భవిష్యత్ అందించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నగరంలో గురువారం సుడిగాలి పర్యటన చేశారు. కార్యనిర్వాహక రాజధానిగా అభివృద్ధి చేసేందుకు అవసరమైన మౌలిక వసతులు కల్పించడంతో పాటు, క్రీడా, వైద్య, పర్యాటకంగా, వ్యాపార కేంద్రంగా, మత్స్య మణిహారంగా, విభిన్న కేంద్రాలకు చిరునామాగా మార్చేందుకు వడివడిగా అడుగులు వేయాలన్న సంకల్పంతో ముఖ్యమంత్రి పర్యటన సాగింది. మొత్తంగా రూ.49 కోట్ల విలువైన ప్రాజెక్టులను ప్రారంభిస్తూ రూ.24.86 కోట్ల పనులకు శంకుస్థాపన చేశారు. వలసలాంధ్రగా మారిన ఉత్తరాంధ్రకు రాజధాని తీసుకొస్తున్న ముఖ్యమంత్రికి ప్రజలు అడుగడుగునా నీరాజనం పలికారు.

క్రీడల రాజధానిగా..

మధ్యాహ్నం 3.30 గంటలకు విశాఖ విమానాశ్రయానికి చేరుకున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి.. అక్కడి నుంచి హెలికాప్టర్‌లో వైఎస్సార్ ఏసీఏ–వీడీసీఏ క్రికెట్ స్టేడియంకు చేరుకున్నారు. దివంగత నేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహాన్ని ఆవిష్కరించారు. విశాఖను క్రీడా రాజధానిగా అభివృద్ధి చేసే దిశగా అడుగులు వేస్తూ కీలక కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. యువ క్రీడాకారులకు ప్రభుత్వం సహకరిస్తోందని భరోసా ఇచ్చారు. వైఎస్సార్ స్టేడియంలో ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకించారు. ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆంధ్ర ప్రీమియర్ లీగ్ సీజన్–2 లోగో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అండర్–19 మహిళా ప్రపంచ వరల్డ్ కప్‌లో భారత్‌కు ఏపీ తరఫున ప్రాతినిథ్యం వహించిన షబ్నం, అంజలి శర్వానీని అభినందించారు. వారికి రూ.10 లక్షల చొప్పున అందించి సత్కరించారు. మరిన్ని విజయాలతో ఆంధ్రకు మంచి పేరుతేవాలని సూచించారు. క్రీడలు, క్రీడాకారుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళిక రూపొందిస్తోందని వెల్లడించారు. ఆంధ్ర తరఫున రంజీ మ్యాచ్‌లాడిన క్రికెటర్లకు ప్రభుత్వం అన్నివిధాల సహకారం అందిస్తుందని భరోసా ఇచ్చారు. ప్రతిభ ఉన్న క్రీడాకారులను గుర్తించి, వారి అభ్యున్నతే లక్ష్యంగా రోడ్ మ్యాప్ తయారుచేసి ప్రభుత్వానికి అందజేయాలని ఏసీఏ అపెక్స్ కౌన్సిల్ కార్యదర్శి గోపినాథ్ రెడ్డి, ఉపాధ్యక్షుడు రోహిత్‌రెడ్డి, సంయుక్త కార్యదర్శి రాకేష్, సీఈవో శివారెడ్డి, ట్రెజరర్ పురుషోత్తంకు సీఎం జగన్ సూచించారు. అనంతరం స్టేడియంలో ఫొటోగ్యాలరీని ప్రారంభించిన సీఎం వైఎస్ జగన్.. స్వీయ దస్తూరితో సంతకం చేశారు. ఏసీఏ అపెక్స్ కౌన్సిల్, వీడీసీఏ, పలు క్లబ్‌లకు చెందిన ప్రతినిధులతో ఆయన ఫొటో సెషన్‌లో పాల్గొన్నారు.

ఇండోర్ స్టేడియంతో క్రీడా వసతులు

జీవీఎంసీ స్మార్ట్ సిటీ నిధులతో రూ.25.50 కోట్లతో ఎంవీపీ కాలనీలో నిర్మించిన ఇండోర్ స్పోర్ట్స్ ఎరీనాను



జ్ఞాపిక అందుకుంటున్న సీఎం వైఎస్ జగన్

ముఖ్యమంత్రి ప్రారంభించారు. విశాఖలో ఉన్న క్రీడాకారులకు పూర్తి వసతులతో కూడిన ఈ స్టేడియాన్ని అంకితం చేశారు. బాస్కెట్‌బాల్, వాలీబాల్, బ్యాడ్మింటన్ కోర్టులతో పాటు యోగా, జిమ్, స్విమ్మింగ్.. ఇలా భిన్నమైన వసతులను క్రీడాకారులకు అందించారు.

వ్యాపార కేంద్రంగా విశాఖ

వాణిజ్య కేంద్రంగా భాసిల్లుతున్న విశాఖకు వచ్చే వారికి.. ప్రతి ఒక్కటి అందుబాటులో ఉండేలా వ్యాపారాలు విస్తరింపజేస్తే నగరం ఆర్థికంగా బలోపేతం కావడంతో పాటు ఉపాధి అవకాశాలు, స్వయం ఉపాధికి దారులు చూపెడతాయని, దానికనుగుణంగా చర్యలు చేపట్టాలని సీఎం అధికారులకు సూచించారు. ఇందులోభాగంగా వీఎంఆర్‌డీఏ ఆధ్వర్యంలో రామ్‌నగర్‌లో రూ.13.50 కోట్లతో నిర్మించిన కమర్షియల్ కాంప్లెక్స్‌ను ప్రారంభించారు.

కలల జెట్టీకి.. శంకుస్థాపన

భీమిలి వద్ద రూ.24.86 కోట్లతో నిర్మించనున్న ఫిషింగ్ జెట్టీకి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ జెట్టీ నిర్మాణానికి రూ.14.91 కోట్లు కేంద్ర ప్రభుత్వం అందిస్తుండగా.. మిగిలిన మొత్తాన్ని రాష్ట్ర ప్రభుత్వం భరించడమే కాకుండా.. మౌలిక వసతులు కల్పించే బాధ్యతను భుజానికెత్తుకుంది. మత్స్యకారుల బతుకుల్లో వెలుగులు నింపేందుకు ఈ భీమిలి జెట్టీ నిర్మాణానికి అవసరమైన ప్రణాళికలు త్వరితగతిన సిద్ధం చేయాలని అధికారులకు సీఎం ఆదేశించారు.

నీరాజనం

ముఖ్యమంత్రి రాకకు ముందుగానే.. 'వైజాగ్ స్టాండ్స్ విత్ యూ.. థాంక్యూ సీఎం సర్' అనే హోర్డింగులతో స్వచ్ఛందంగా స్వాగతం పలికిన ఉత్తరాంధ్ర ప్రజలు.. గురువారం కూడా అదే రీతిలో నీరాజనం పలికారు. పీఎంపాలెంలోని క్రికెట్ స్టేడియం వద్ద.. సీఎం జగన్‌ను చూసేందుకు ప్రజలు పోటీపడ్డారు. ముఖ్యమంత్రి స్టేడియం వద్దకు చేరుకోగానే 'థాంక్యూ సీఎం సర్' అనే నినాదంతో మధురవాడ మార్మోగింది. బీచ్‌రోడ్డులో సీహారియర్ మ్యూజియం వద్ద కూడా సీఎంను చూసేందుకు వచ్చిన ప్రజల నుంచి అదే స్పందన కనిపించింది. సీఎం అందరికీ ఆత్మీయ అభివాదం చేస్తూ అక్కడ నుంచి విమానాశ్రయానికి బయలుదేరివెళ్లారు.

బీచ్‌కు మణిహారం

బీచ్‌రోడ్డులో రూ.10 కోట్లతో ఏర్పాటు చేసిన సీ హారియర్ యుద్ధ విమాన మ్యూజియాన్ని సీఎం జగన్ ప్రారంభించి పర్యాటకులకు అందుబాటులోకి తీసుకొచ్చారు. యుద్ధ విమాన విడిభాగాలతో సిమ్యులేటర్స్ ప్రత్యేక ఆకర్షణగా ఉన్న మ్యూజియం బీచ్‌కు మణిహారంగా మారుతుందని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా సీహారియర్ మ్యూజియాన్ని దాదాపు 5 నిమిషాల పాటు పరిశీలించారు. సీ హారియర్‌లోని ప్రతి ఒక్క భాగం గురించి తూర్పు నౌకాదళాధిపతి వైస్ అడ్మిరల్ బిస్వజిత్‌దాస్ గుప్తా వివరించారు. టీయూ–142, కురుసుర సబ్‌మెరైన్, సీహారియర్ మ్యూజియాన్ని ఇంటిగ్రేట్ చేయాలని వీఎంఆర్‌డీఏ అధికారులను సూచించారు. బీచ్‌కు వచ్చే ప్రతి పర్యాటకుడు ఈ మూడు మ్యూజియాలను సందర్శించేలా అభివృద్ధి చేయాలని సీఎం సూచించారు.



సీహారియర్ మ్యూజియం ప్రారంభోత్సవంలో...



బాలుడిని ఆప్యాయంగా పలకరిస్తూ...

ఆరోగ్య విశాఖ..



అపోలో క్యాన్సర్ ఆసుపత్రిని ప్రారంభించిన సీఎం వైఎస్ జగన్

విశాఖ ప్రజలకు అంతర్జాతీయ స్థాయి సాంకేతికత, మౌలిక సదుపాయాలతో కూడిన అధునాతన వైద్య వ్యవస్థలు అందుబాటులోకి రావడం శుభపరిణామమని సీఎం వైఎస్ జగన్ అన్నారు. దివంగత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో ప్రారంభమైన ఆరిలోవ హెల్త్‌సిటీలో ఉన్న అపోలో హాస్పిటల్‌లో 54 వేల చ.అడుగుల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన అత్యాధునిక క్యాన్సర్ కేంద్రాన్ని ప్రారంభించారు. ట్రూ బీమ్ ఎస్టీఎక్స్ టెక్నాలజీ కలిగిన ఏపీలోనే మొట్టమొదటి, ఏకైక క్యాన్సర్ కేంద్రాన్ని విశాఖలో ఏర్పాటు చేయడంపై అపోలో గ్రూప్స్ చైర్మన్ డా.ప్రతాప్ సి రెడ్డి, ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్‌పర్సన్ డా.ప్రీతారెడ్డిని అభినందించారు.





మహిళా క్రికెటర్లు షబ్నం, అంజలి శర్వానీకి నగదు ప్రోత్సాహకాలు అందిస్తున్న సీఎం వైఎస్ జగన్

ఏయూకి పేటెంట్ మంజూరు

రీసెర్చ్ టీమ్‌ను అభినందించిన వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి



పేటెంట్ ఉత్తర్వులను అందజేస్తున్న వీసీ ప్రసాదరెడ్డి

ఎంవీపీకాలనీ (విశాఖ తూర్పు): మెటల్ ఫ్రీ హైడ్రోజన్ సెన్సార్ అండ్ మెథడ్ ఆఫ్ ఫ్యాబ్రికేషన్ అంశంపై ఆంధ్రవిశ్వవిద్యాలయం కెమిస్ట్రీ విభాగం జరిపిన పరిశోధనల ఆవిష్కరణకు పేటెంట్ లభించింది. ఈ మేరకు భారత కంట్రోలర్ ఆఫ్ పేటెంట్స్ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ వివరాలను ఏయూ వీసీ ఆచార్య పీవీజీడీ ప్రసాదరెడ్డి వెల్లడించారు. ఏయూ కెమిస్ట్రీ విభాగం ద్వారా ఆచార్య కె.సురేష్ బాబు, ఆచార్య బసవయ్యతో పాటు పలువురు విద్యార్థులు కలిసి ఈ పరిశోధనలు చేసినట్లు తెలిపారు. ఈ అప్లికేషన్ హైడ్రోజన్ ఎకానమీ వృద్ధిలో ఉపయోగపడుతుందన్నారు. ఈ ఆవిష్కరణ మెటల్ రహిత హైడ్రోజన్ సెన్సార్ , హైడ్రోకార్బన్, ఇతర ప్రాసెసింగ్ పరిశ్రమలలో సేవలకు ఉపయుక్తంగా ఉంటుందని తెలిపారు. ఈ పెటెంట్ పొందడంతో సెంటర్ ఫర్ ఇంటలెక్చువల్ ప్రాపర్టీ రైట్స్ చైర్ హెడ్ ఆచార్య పురుషోత్తంను అభినందించారు. ఈ పరిశోధక ఆవిష్కరణకు కేవలం 11 నెలల్లోనే పేటెంట్ మంజూరు చేయడం అభినందనీయమన్నారు. సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య శ్రీనివాసరావు, ఆచార్య పురుషోత్తం, ఆచార్య బసవయ్య, పరిశోధకులు నాని, కృష్ణవేణి పాల్గొన్నారు.

స్టార్టప్‌ల్లో రెట్టింపు పెట్టుబడులు

దొండపర్తి(విశాఖ దక్షిణ): ఆంధ్రప్రదేశ్ స్టార్టప్స్‌లో పెట్టుబడులు కోవిడ్ కంటే ముందుతో పోల్చుకుంటే రెట్టింపు అయ్యాయని ఐటీ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు శ్రీధర్ కొసరాజు తెలిపారు. స్టార్టప్‌లను ప్రోత్సహిస్తూ వారికి అవసరమైన పెట్టుబడుల కల్పనకు బాటలు వేసేందుకు సక్సీడ్ ఇండోవేషన్ ఫండ్ సహకారంతో ఏపీ స్టార్టప్స్ అండ్ డీప్ టెక్ ఇండియా ఆధ్వర్యంలో గురువారం టెక్ మహీంద్రా కార్యాలయంలో ఉన్న టెక్‌హబ్‌లో స్టార్టప్ ఇన్వెస్ట్‌మెంట్ మాస్టర్ క్లాస్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 30 మంది ఇన్వెస్టర్లు, ఐటీ, ఎంటర్‌టైన్‌మెంట్, ఫార్మా, కన్‌స్ట్రక్షన్, మానుఫ్యాక్చరింగ్, షిపింగ్ రంగాల నుంచి పెట్టుబడులు ఆశించే స్టార్టప్ ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీధర్ కొసరాజు మాట్లాడుతూ స్టార్టప్స్‌లో పెట్టుబడులు ద్వారా అధిక రిటర్న్స్ వస్తుండడంతో చాలా మంది ఇన్వెస్టర్లు నూతన స్టార్టప్‌లలో ఇన్వెస్ట్ చేసేందుకు ఆసక్తి చూపిస్తున్నారని చెప్పారు. డీప్ టెక్ స్టార్టప్స్‌లో పెట్టుబడులు పెట్టేందుకు ఈ సమావేశం తొలి అడుగు అని పేర్కొన్నారు. కార్యక్రమంలో సక్సీడ్ ఇండోవేషన్ ఫండ్ జనరల్ పార్టనర్స్ రమేష్ లోకనాథన్, విక్రాంత్ వర్ష్నే పాల్గొని స్టార్టప్స్‌ను ప్రోత్సహించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న సహకారాన్ని వివరించారు.

టెన్త్ టాపర్స్‌కు సన్మానం నేడు

విశాఖ విద్య: ప్రభుత్వ యాజమాన్యాల పరిధిలోని పాఠశాలల్లో చదువుతూ 10వ తరగతి ఫలితాల్లో ప్రతిభ చాటిన విద్యార్థులను ప్రోత్సహించేలా విద్యాశాఖ ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా సిరిపురం వీఎంఆర్‌డీఏ చిల్డ్రన్ ఎరీనాలో శుక్రవారం ఉదయం 10 గంటలకు ప్రత్యేక వేడుక ఏర్పాటు చేశారు. ఇటీవల విడుదలైన 10వ తరగతి ఫలితాల్లో ప్రభుత్వ యాజమాన్యాల పరిధిలోని పాఠశాలల్లో 570 ఆ పై మార్కులు సాధించిన 63 మంది విద్యార్థులను గుర్తించి, వారిని సత్కరించేందుకు ఈ వేడుకలో తగిన ఏర్పాట్లు చేశారు. విద్యార్థులు, వారిని ప్రోత్సహిస్తున్న తల్లిదండ్రులు, టాపర్స్‌గా నిలిచేందుకు తోడ్పాటు అందించిన పాఠశాల హెచ్‌ఎంలను సన్మానించనున్నారు. కలెక్టర్ డాక్టర్ మల్లికార్జున, విద్యా శాఖ జిల్లా ఉన్నతాధికారులతో కలసి విద్యార్థులంతా విందు భోజనం చేసేలా ఏర్పాట్లు చేశారు. ఎంపిక చేసిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులు సకాలంలో ఈ కార్యక్రమానికి హాజరుకావాలని డిప్యూటీ డీఈవో గౌరీ శంకర్ కోరారు.


ఆర్‌ఈపీఎం ప్రాజెక్ట్ ప్రారంభం



ఢిల్లీలో వర్చువల్‌గా ఆర్‌ఈపీఎం ప్రాజెక్ట్ ప్రారంభిస్తున్న ప్రధాని మోదీ

సాక్షి, విశాఖపట్నం: విశాఖలో మరో కీలక ప్రాజెక్టు ప్రారంభమైంది. గురువారం ఢిల్లీలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రధాని నరేంద్ర మోదీ రేర్ ఎర్త్ పర్మినెంట్ మాగ్నెట్ (ఆర్‌ఈపీఎం) ప్లాంట్ ప్రాజెక్టును ప్రారంభించిన అనంతరం జాతికి అంకితం చేశారు. జాతీయ సాంకేతిక దినోత్సవం ప్రారంభమై 25 ఏళ్లు అయిన సందర్భంగా ఈనెల 11 నుంచి 14 తేదీ వరకు నిర్వహించనున్న వివిధ కార్యక్రమాలను మోదీ ప్రారంభించారు. శాస్త్ర, సాంకేతిక అభివృద్ధికి దోహదం చేసే రూ.5,800 కోట్లు విలువ చేసే ప్రాజెక్టులకు భూమి పూజతోపాటు పలు ప్రాజెక్టులను జాతికి అంకితం చేశారు. ఇందులో భాగంగా విశాఖలో రక్షణ రంగానికి సంబంధించిన కీలక ప్రాజెక్టును ప్రారంభించారు. బార్క్ కేంద్రంలో ఈ ప్లాంట్‌ను ఐఆర్‌ఈఎల్ ఆధ్వర్యంలో నిర్మించారు.

విశాఖ పోర్టు సరికొత్త రికార్డు



విశాఖ పోర్టులో నిలిపిన వెసెల్స్

దొండపర్తి(విశాఖ దక్షిణ): విశాఖ పోర్ట్ అథారిటీ సరికొత్త రికార్డును నమోదు చేసింది. ఇప్పటి వరకు కార్గో రవాణాలో దూసుకుపోతున్న పోర్టు.. తాజాగా రవాణా నౌకల యాంకరింగ్ విషయంలో తన సత్తా చాటింది. ఈ నెల 1వ తేదీ నుంచి 10వ తేదీ వరకు 75 వెసెల్స్‌ను విశాఖ పోర్టులో నిలిపారు. వేగవంతమైన కార్గో హ్యాండ్లింగ్, సమగ్రమైన ప్రణాళికతో మునుపెన్నడూ లేని విధంగా పెద్ద సంఖ్యలో నౌకలకు బెర్తులు కేటాయించడంలో.. అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది కృషిని పోర్టు ఉన్నతాధికారులు ప్రశంసించారు.

బాగున్నావా అన్నా..?



జయహో జగన్ అంటూ నినాదాలు చేస్తున్న ప్రజలు

- పేరు పేరున ఆత్మీయ పలకరింపు
- పార్టీ శ్రేణుల యోగక్షేమాలపై ఆరా
- శాలువాలు కప్పి సత్కరించిన సీఎం వైఎస్ జగన్



సాక్షి, విశాఖపట్నం/మధురవాడ: 'బాగున్నావా అన్నా? మన వాళ్లంతా ఎలా ఉన్నారు? కుటుంబ సభ్యులు బాగున్నారా? అంటూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పార్టీ శ్రేణులను పేరుపేరునా పలకరించారు. వారి యోగక్షేమాలను ఆప్యాయంగా అడిగి తెలుసుకున్నారు. పార్టీ కోసం అంతా కలిసికట్టుగా పని చేయాలని, ప్రజలకు సేవ చేయడంలో ముందుండాలని హితవు పలికారు. గురువారం సాయంత్రం పీఎంపాలెం డాక్టర్ వైఎస్సార్ ఏసీఏ–వీడీసీఏ స్టేడియంలో వైఎస్సార్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం స్టేడియంలో అండర్–19 మహిళా క్రికెటర్లు, రంజీ ఆటగాళ్లను అభినందించారు. ఆ తర్వాత భీమిలి నియోజకవర్గం నేతలతో ముచ్చటించారు. ఒక్కో నాయకుడి పేరును చిరునవ్వు చిందిస్తూ తెలుసుకున్నారు. వారి చేతిలో చేయి వేశారు. ఆయా నాయకుడి మెడలో శాలువా కప్పారు. కొంతమంది నాయకులు తమ ఆరోగ్య సమస్యలను, మరికొందరు నియోజకవర్గంలో చేపట్టాల్సి ఉన్న పనులను వివరించారు. ఇంకొందరు ఆయన అందిస్తున్న పరిపాలన మెచ్చుకున్నారు. 'మీరు పరిపాలిస్తున్నది మనుషులను కాదు.. మనసులను సార్' అంటూ తమ మనసులోని మాటను చెప్పారు. మేమంతా మీ వెంటే ఉంటాం, మళ్లీ మళ్లీ మీరే సీఎం కావాలంటూ అభిలషించారు. ఒకప్పుడు ఎస్సీ కాలనీలు ఊరికి దూరంగా ఉండేవని, జగనన్న కాలనీల ఏర్పాటు ద్వారా అన్ని వర్గాల వారికి ఒకే చోట ఇళ్లు నిర్మించి ఇస్తున్నారంటూ సీఎంను దళిత నాయకులు కొనియాడారు.

సమస్యలపై వినతులు

పద్మనాభం మండలం అనంత పద్మనాభస్వామి ఆలయం ఘాట్ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని మరో నేత కోరారు. ఆనందపురం మండలం జగన్నాథపురంలో గ్రేహౌండ్స్ కోసం ప్రభుత్వం తీసుకున్న భూమికి ఇంకా ఇవ్వాల్సిన రూ.8 కోట్ల పరిహారం త్వరలో విడుదల చేసేలా చర్యలు తీసుకోవాలని ఆ మండల నాయకుడొకరు విజ్ఞప్తి చేశారు. సింహాచలం పంచ గ్రామాల సమస్య పరిష్కారానికి చొరవ చూపినందుకు జీవితాంతం రుణపడి ఉంటామని 98వ వార్డు నాయకులు సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు. 89వ వార్డులో టీడీపీ ఎమ్మెల్యే గణబాబు అక్రమాలకు అంతే లేకుండా పోతోందని, వాటి వివరాలను ముఖ్యమంత్రి దృష్టికి ఆ వార్డు నాయకుడు తీసుకెళ్లారు. పార్టీలో మరో సీనియర్ నాయకుడిని ఎలా ఉన్నావు అన్నా.. అంటూ పలకరించారు. ఆరోగ్యం బాగోలేదు సార్.. అని చెప్పగానే ఒకసారి వచ్చి కలవమని చెప్పారు. ఇలా తెలిసిన నాయకులను పేరు పేరునా పలకరించారు. తెలియని వారి పేర్లనూ తెలుసుకొని కుశల ప్రశ్నలు అడిగారు. దాదాపు అరగంట సేపు ఒక్కొక్కరినీ కలుస్తూ ముందుకు సాగారు. యోగక్షేమాలు అడిగాక వారి మెడలో శాలువాలు కప్పారు. సాక్షాత్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ తమ పట్ల చూపించిన ఆప్యాయత, అనురాగాలకు వీరంతా ఎంతో ఖుషీఖుషీ అయ్యారు.

సీఎం జగన్‌కు ఆత్మీయ స్వాగతం


ముఖ్యమంత్రి జగన్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న మేయర్ హరి వెంకటకుమారి


ముఖ్యమంత్రి జగన్‌కు స్వాగతం పలుకుతున్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు


ముఖ్యమంత్రికి స్వాగతం పలుకుతున్న ఇన్‌చార్జి మంత్రి విడదల రజని, ప్రభుత్వ విప్ ధర్మశ్రీ


ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న కలెక్టర్ మల్లికార్జున, సీపీ త్రివిక్రమ్ వర్మ, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ

సాక్షి, విశాఖపట్నం/గోపాలపట్నం: నగరంలో పలు అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభం, శంకుస్థాపనకు విచ్చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి విశాఖ విమానాశ్రయంలో ఘన స్వాగతం లభించింది. సీఎం జగన్ గురువారం మధ్యాహ్నం 2.21 గంటలకు గన్నవరం విమానాశ్రయం నుంచి బయలుదేరి 3.30 గంటలకు విశాఖ విమానాశ్రయానికి చేరుకున్నారు. ఆయనకు మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు, జిల్లా ఇన్‌చార్జి మంత్రి విడదల రజిని, పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ, ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ, కలెక్టర్ ఎ.మల్లికార్జున, ఎయిర్‌పోర్టు అథారిటీ అసిస్టెంట్ డైరెక్టర్ రాజారామ్ స్వాగతం పలికారు. అక్కడి నుంచి 3.45 గంటలకు హెలికాప్టర్‌లో పీఎంపాలెంలోని డాక్టర్ వైఎస్సార్ ఏసీఏ–వీడీసీఏ స్టేడియానికి బయలుదేరారు. నగరంలో కార్యక్రమాలు ముగించుకుని సాయంత్రం 6.50 గంటలకు రోడ్డు మార్గంలో బయలుదేరి విశాఖ ఎయిర్‌పోర్టుకు చేరుకున్నారు. 7.20 గంటలకు విమానంలో గన్నవరం బయలుదేరారు. ముఖ్యమంత్రి పాల్గొన్న కార్యక్రమాల్లో తిరుమల తిరుపతి దేవస్థానం చైర్మన్ వై.వి సుబ్బారెడ్డి, డిప్యూటీ సీఎంలు బూడి ముత్యాలనాయుడు, పీడిక రాజన్నదొర, నారాయణ స్వామి, మంత్రులు బొత్స సత్యనారాయణ, విడదల రజిని, ధర్మాన ప్రసాదరావు, గుడివాడ అమర్‌నాథ్, సీదిరి అప్పలరాజు, మేరుగ నాగార్జున, ఆర్.కె.రోజా, మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, ఎంపీలు ఎంవీవీ సత్యనారాయణ, భీశెట్టి వెంకట సత్యవతి, గొడ్డేటి మాధవి, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ, ఎమ్మెల్సీలు వంశీకృష్ణ శ్రీనివాస్, పి.రవీంద్ర, వరుదు కల్యాణి, ఎమ్మెల్యేలు ముత్తంశెట్టి శ్రీనివాసరావు, ధర్మాన కృష్ణదాస్, కన్నబాబు రాజు, వాసుపల్లి గణేష్‌కుమార్, తిప్పల నాగిరెడ్డి, అన్నంరెడ్డి అదీప్‌రాజ్, రెడ్డి శాంతి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు పంచకర్ల రమేష్ బాబు, సమన్వయకర్తలు కె.కె.రాజు, అక్కరమాని విజయనిర్మల, ఆడారి ఆనంద్, కార్పొరేషన్ చైర్మన్లు కోలా గురువులు, సీతంరాజు సుధాకర్, జాన్ వెస్లీ, డిప్యూటీ మేయర్లు జియ్యాని శ్రీధర్, కె.సతీష్, ఆడిటర్ జి.వి, జీవీఎంసీ ఫ్లోర్ లీడర్ బానాల శ్రీనివాస్, నాయకులు అక్కరమాని వెంకటరావు, కలెక్టర్ మల్లికార్జున, సీపీ త్రివిక్రమ్ వర్మ, జేసీ కె.ఎస్ విశ్వనాథన్, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ, ఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్.. అదే రూట్

- ఇంటర్ బోర్డు ఆదేశాలు పట్టని యాజమాన్యాలు
- నిబంధనలకు విరుద్ధంగా ముందస్తు అడ్మిషన్లు
- వేసవి సెలవుల్లోనూ తరగతుల నిర్వహణ
- సీట్లు ఫుల్ అంటూ ఆర్భాటపు ప్రచారం
- మండిపడుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు

విశాఖ విద్య: వేసవి సెలవుల్లోనూ జిల్లాలోని కొన్ని ప్రైవేట్ కళాశాలలు దర్జాగా తరగతులు నిర్వహిస్తున్నాయి. 2023–24 విద్యా సంవత్సరానికి జూన్ ఒకటో తేదీన కళాశాలలు తెరవాలని ఇంటర్మీడియట్ బోర్డు కమిషనర్ ఆదేశించినా.. కొన్ని ప్రైవేట్, కార్పొరేట్ కళాశాలల నిర్వాహకులు ఇవేమీ పట్టించుకోవడం లేదు. గురువారం యథావిధిగా కళాశాలలు పనిచేశాయి. అధ్యాపకులు, సిబ్బంది కళాశాలలకు హాజరయ్యారు. జూనియర్ కళాశాలలకు వేసవి సెలవులివ్వాలని, తరగతులు నిర్వహించడానికి వీల్లేదని ఉమ్మడి విశాఖ జిల్లా ప్రాంతీయ పర్యవేక్షణాధికారి ఉమారాణి హెచ్చరించినా.. కళాశాలల యాజమాన్యాలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తుండటం తీవ్ర విమర్శలకు తావిస్తోంది.

సెకండ్ ఇయర్ సిలబస్ మొదలు పెట్టేశారు

నిబంధనలకు విరుద్ధంగా కార్పొరేట్ కళాశాలల్లో ఇంటర్ రెండో సంవత్సరం విద్యార్థులకు తరగతులను నిర్వహిస్తుండటం గమనార్హం. వచ్చే విద్యా సంవత్సరానికి సంబంధించిన సిలబస్‌ను ప్రారంభించి.. ఉదయం 9 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు టైంటేబుల్ ప్రకటించినట్లు విద్యార్థులు చెబుతున్నారు. పిల్లలు వేసవి సెలవులను ఆనందంగా గడపనీయకుండా తరగతులు నిర్వహించడంపై తల్లిదండ్రులు పెదవి విరుస్తున్నారు. తమ పిల్లలు ఎక్కడ వెనుకబడిపోతారేమోననే ఆందోళనతో తప్పనిసరి పరిస్థితుల్లో మండు టెండల్లోనూ కళాశాలలకు పంపిస్తున్నారు.


తరగతులు నిర్వహిస్తున్న ఆశీల్‌మెట్టలోని నారాయణ కళాశాల

అనుమతుల్లేకుండానే అడ్మిషన్లు

నగరంలోని కొన్ని ప్రైవేట్, కార్పొరేట్ జూనియర్ కళాశాలల్లో మొదటి సంవత్సరం అడ్మిషన్లు సైతం చేపడుతుండటంతో విద్యార్థులు తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారు. ప్రైవేట్, కార్పొరేట్ కళాశాలలకు గుర్తింపునిచ్చేందుకు ఈ సారి కలెక్టర్ పర్యవేక్షణలో తనిఖీలు కొనసాగేలా ఇంటర్ బోర్డు కార్యాచరణ ప్రకటించింది. ఉమ్మడి విశాఖ జిల్లాలో నాలుగు టీమ్‌లుగా ఏర్పడిన జిల్లా అధికారులు ప్రస్తుతం కాలేజీల్లో తనిఖీలు నిర్వహిస్తున్నారు. వీరిచ్చే నివేదిక ఆధారంగానే 2023–24 విద్యా సంవత్సరంలో ప్రైవేట్ కళాశాలల నిర్వహణకు అనుమతి ఇవ్వనున్నారు. కానీ ఇవేమీ పట్టించుకోకుండానే కొన్ని ప్రైవేట్ కళాశాలల్లో అడ్మిషన్లు చేపడుతూ.. మరో పక్క తరగతులను సైతం నిర్వహిస్తుండటం గమనార్హం. ఫీజుల వసూళ్ల కోసమని ఫస్టియర్ సీట్లు అయిపోయాయంటూ ఆర్భాటపు ప్రచారాలు సైతం చేస్తున్నారు. ఇంటర్ బోర్డు అధికారులు, కలెక్టర్ మల్లికార్జున దృష్టి సారించి.. ఇలాంటి వాటిని నియంత్రించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

నారాయణ కళాశాలకు షోకాజ్ నోటీసులిచ్చాం



వేసవి సెలవుల్లో తరగతులు నిర్వహిస్తున్నారనే ఫిర్యాదుల నేపథ్యంలో నగరంలోని ప్రైవేట్ కళాశాలలపై తనిఖీలు నిర్వహిస్తున్నాం. నారాయణ కళాశాలలో తరగతులు జరుగుతున్నట్లు నిర్ధారణ కావడంతో.. నిర్వాహకులకు షోకాజ్ నోటీసులు జారీ చేశాం. కళాశాలలపై నిరంతరం నిఘా ఉంటుంది. వేసవి సెలవుల్లోనూ తరగతులు నిర్వహించే కళాశాలల యాజమాన్యాలపై కఠిన చర్యలు తప్పవు.

– పి.ఉమారాణి, ఆర్‌ఐవో, ఉమ్మడి విశాఖ జిల్లా


వైజాగ్ వారియర్స్ క్రికెట్ ఫ్రాంచైజీ కొత్త లోగోను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆవిష్కరించారు. చిత్రంలో పల్సస్ గ్రూప్ సీఈవో, వైజాగ్ వారియర్స్ యజమాని డాక్టర్ శ్రీనుబాబు గేదెల ఉన్నారు.

ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఉచిత శిక్షణ

కంచరపాలెం: పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ప్రభుత్వ బాలికల పారిశ్రామిక శిక్షణ సంస్థ ప్రాంగణంలోని జాతీయ కెరీర్ సర్వీస్ సెంటర్ ఫర్ ఎస్సీ, ఎస్టీ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ ఇవ్వనున్నారు. ఈ మేరకు సబ్ రీజినల్ ఉపాధి కార్యాలయం అధికారి శ్యాంసుందర్ నిట్టాల ఓ ప్రకటన విడుదల చేశారు. 18–27 ఏళ్ల మధ్య వయసు ఉండి, ఇంటర్ ఆపైన కోర్సులు చదివిన అభ్యర్థులు శిక్షణకు అర్హులన్నారు. ఎంపికైన వారికి నెలకు రూ.1000 స్టైఫండ్‌తో పాటు ఉచిత శిక్షణ ఇస్తామన్నారు. ఈ నెల 15లోగా నేషనల్ కెరీర్ సర్వీస్ సెంటర్ పోర్టల్ https:// ncs.gov.inలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

కనకమహాలక్ష్మి సన్నిధిలో ఆర్టీఐ కమిషనర్


అమ్మవారి సన్నిధిలో ఆర్టీఐ కమిషనర్ జనార్దనరావు దంపతులు

అల్లిపురం: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారిని ఆర్టీఐ కమిషనర్ జి.జనార్దనరావు దంపతులు గురువారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వారికి ఆలయ ఈవో కె.శిరీష, ఏఈవో రాంబాబు స్వాగతం పలికారు. ఆలయ అర్చకుడు వారి పేరిట అమ్మవారికి విశేష పూజలు చేసి వేద ఆశీర్వచనాలు, తీర్థ ప్రసాదాలు అందజేశారు.

మహిళా ఎస్‌ఐ సహా భర్తపై దాడి?

తగరపువలస: తమ ఇంటికి సమీపంలో వ్యక్తులు తమపై దాడి చేశారని భీమిలి మండలం మజ్జివలస పంచాయతీకి చెందిన మహిళా ఎస్‌ఐ బెల్లాన సంతోషి కుమారి, ఆమె భర్త శివప్రసాద్‌లు గురువారం భీమిలి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సంతోషికుమారి పార్వతీపురం మన్యం జిల్లాలోని దిశ సెల్‌లో ఎస్‌ఐగా, ఆమె భర్త శివప్రసాద్ భీమిలి మండలం అన్నవరం పంచాయతీలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. మజ్జివలసలో ఇంటి నిర్మాణానికి సంబంధించి కొంతకాలంగా ఇరువర్గాల మధ్య తగాదా నడుస్తోంది. గతంలో కూడా ఇరువర్గాలు భీమిలి పోలీసులను ఆశ్రయించారు. తాజా సంఘటనపై పోలీసులు స్పందించాల్సి ఉంది.

ఓపెన్ చాలెంజ్ ప్రోగ్రామ్ ప్రారంభం


కార్యక్రమంలో మాట్లాడుతున్న సీఎండీ భట్

ఉక్కునగరం: ఓపెన్ చాలెంజ్ ప్రోగ్రామ్ (ఓసీపీ) 2.0ను స్టీల్‌ప్లాంట్ సీఎండీ అతుల్ భట్ గురువారం ఆన్‌లైన్‌లో ప్రారంభించారు. ఉక్కు పరిపాలన భవనంలో కల్పతరు – సీఈవో (సెంటర్ ఆఫ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్) ద్వారా ఏర్పాటు చేసిన రెండో కార్యక్రమం ఇది. ఇండస్ట్రీ 4.0 టెక్నాలజీస్ రంగంలో స్టార్టప్‌లను ఎంపిక చేయడం కోసం ఈ ఓపెన్ చాలెంజ్ ప్రోగామ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎండీ అతుల్ భట్ మాట్లాడుతూ ఉక్కు పరిశ్రమలో ఆటోమేషన్ ఈ రోజు అవసరం అని, ఆటోమేషన్, రోబోటిక్స్ వృద్ధి అపారమైనదని అన్నారు. స్టార్టప్‌లు అభివృద్ధి చేసే పరికరాలు ఇంధన పొదుపు, ఉత్పత్తి ప్రక్రియను సురక్షితంగా నడపడంలో కూడా సహాయపడతాయని చెప్పారు. కార్యక్రమంలో డైరెక్టర్ (ప్రాజెక్ట్స్) ఎ.కె. బాగ్చీ, కల్పతరు సభ్యుడు సి.వి.డి. రాంప్రసాద్, అదనపు డైరెక్టర్ డాక్టర్ సురేష్ బాతా పాల్గొన్నారు.

ముగిసిన జాతీయ సాంకేతిక దినోత్సవం

- 95 శాతం క్షిపణులు, టార్పిడోలు దేశీయంగానే తయారు కావడం గర్వకారణం
- డైరెక్టర్ శ్రీనివాసరావు


ప్రథమ బహుమతి అందుకుంటున్న సృజనవాణి వలంటరీ అసోసియేషన్ విద్యార్థులు

గోపాలపట్నం: ఎన్‌ఎస్‌టీఎల్‌లో మూడు రోజులుగా జరుగుతున్న సాంకేతిక దినోత్సవం గురువారంతో ఘనంగా ముగిసింది. సంస్థ డైరెక్టర్ వై. శ్రీనివాసరావు తొలుత అబ్దుల్ కలాం విగ్రహానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాస్త్రవేత్తలు, సాంకేతిక నిపుణుల నిరంతర కృషితో ఎన్‌ఎస్‌టీఎల్ అభివృద్ధిపథాన దూసుకుపోతుందన్నారు. 95 శాతం క్షిపణులు, టార్పిడోలు దేశీయంగానే తయారు కావడం మనకు గర్వకారణం అన్నారు. ఈ ఓపెన్ హౌస్ ప్రదర్శనను 6,200 మందికి పైగా విద్యార్థులు సందర్శించారని తెలిపారు. ప్రొఫెసర్ డీవీఎల్ఎన్ సోమయాజులు అధునాతన వ్యవస్థల అభివృద్ధి, గ్లోబల్ టెక్నాలజీ ప్రాముఖ్యతను వివరించారు. డాక్టర్ జీఎస్ రావు లాఫింగ్ బుద్ధా అనే కోడ్ నేమ్‌తో ఆపరేషన్ శక్తిని మే 1998లో, మిషన్ శక్తిని 2019లో ఎలా అమలు చేశారో వివరించారు. ఎన్‌ఎస్‌టీఎల్ శాస్త్రవేత్త ఆనంద్‌కుమార్‌కు టైటానియం అవార్డును డైరెక్టర్ శ్రీనివాసరావు అందించారు. 'బెస్ట్ టార్పిడో రిలీజ్ మెకానిజం'అనే అంశంపై చేసిన ప్రసంగానికి ఆయన ఈ మెడల్ దక్కించుకున్నారు.

విద్యార్థులకు బహుమతులు

వైజ్ఞానిక ప్రదర్శనలో గెలుపొందిన వారికి బహుమతులు అందించారు. సృజనవాణి వలంటరీ అసోసియేషన్ ద్వారా విద్యార్థులు చేపట్టిన ఐవోటీ బేస్డ్ స్మార్ట్ అగ్రికల్చర్ మానిటరింగ్ సిస్టమ్ ప్రాజెక్ట్‌కు మొదటి బహుమతి వచ్చింది. విద్యార్థులు టి. తేజస్విని, వై.జస్వంత్‌కు జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు అందించారు. రెండో బహుమతి రివర్ రాగ్ రిమూవర్‌కు, మూడో బహుమతి ఆక్వాపోనిక్స్ ప్రాజెక్టుకు దక్కాయి. కళాశాల విభాగంలో దాడి ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు జి. జయశంకర్‌రెడ్డి, ఎ. దినేష్ కుమార్ రూపొందించిన లైట్ ట్రాన్స్‌మిటింగ్ కాంక్రీట్ బ్రిక్ మొదటి బహుమతి దక్కించుకుంది. రెండు బహుమతులు విజ్ఞాన్ కళాశాల విద్యార్థులు పొందారు. సీనియర్ శాస్త్రవేత్తలు పీవీఎస్ గణేష్‌కుమార్, బీవీఎస్ఎస్ కృష్ణకుమార్ పాల్గొన్నారు.

శిశుగృహలో ఇద్దరు చిన్నారుల దత్తత


దత్తత తీసుకున్న తల్లిదండ్రులతో సీతారం దంపతులు, శిశుగృహ సిబ్బంది

మర్రిపాలెం(విశాఖ ఉత్తర): చట్టరీత్యా దత్తత తీసుకోవడం నూరు శాతం శ్రేయస్కరమని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారాం అన్నారు. 53వ వార్డు మర్రిపాలెంలోని ప్రభుత్వ శిశుగృహలో గురువారం ఇద్దరు పిల్లల దత్తత ప్రక్రియ నిర్వహించారు. కర్ణాటకలోని బెంగళూరు వైట్‌ఫీల్డ్ ప్రాంతానికి చెందిన ఎం.వినోద్‌కుమార్ చంద్రమౌళి, దీప్తి దంపతులకు 8 నెలల అమ్మాయిని, రాష్ట్రంలోని ఒంగోలు తూర్పు కమ్మపాలేనికి చెందిన టి.నాగరాజు, నాగమణి దంపతులకు 9 నెలల అబ్బాయిని చట్టప్రకారం అందజేశారు. స్త్రీ శిశుసంక్షేమ శాఖ, ఐసీపీఎస్ డీసీపీయూ విభాగాలు ఈ ప్రక్రియను చేపట్టాయి. కమిషన్ సభ్యుడు సీతారాం చేతుల మీదుగా పిల్లలను తల్లిదండ్రులకు అందజేశారు. కార్యక్రమంలో సీడీపీవో రమణకుమారి, జిల్లా బాలల సంరక్షణ అధికారి ఎం.రమేష్, శిశుగృహ మేనేజర్ సుజాత, సోషల్ వర్కర్ ఎస్‌పీఎస్ రామలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

నాడు నేడు.. యమస్పీడ్!

- జిల్లాలో రెండో విడత 317 పాఠశాలల అభివృద్ధి
- రూ.122.64కోట్లతో మౌలిక వసతుల పెంపు
- ఇప్పటికే రూ.43.15కోట్ల పనులు పూర్తి


అడవి వరం జెడ్పీ హైస్కూల్‌లో పూర్తయిన పైకప్పు

విశాఖ విద్య: ప్రభుత్వ పాఠశాలలు రూపురేఖలు మార్చేలా నాడు–నేడు కింద చేపడుతున్న అభివృద్ధి పనుల్లో వేగం పెంచేలా జిల్లా అధికారులు ఫోకస్ పెట్టారు. 2023–24 విద్యా సంవత్సరంలో బడులు తెరిచే రోజు నాటికి 100 శాతం పనులు పూర్తి చేసేలా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున విద్యాశాఖ యంత్రాంగానికి దిశానిర్దేశం చేశారు. నాడు–నేడు రెండో విడతలో భాగంగా జిల్లాలో 317 పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పనకు పనులు చేపట్టారు. ఇందుకోసం రూ.122.64 కోట్లను ప్రభుత్వం మంజూరు చేసింది.

రూ.43.15 కోట్ల బిల్లుల చెల్లింపు : నాడు–నేడు పనులు ప్రాధాన్య దృష్ట్యా నిధుల కొరత లేకుండా ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోంది. రెండో విడతలో భాగంగా 539 పనులు ప్రతిపాదించగా, వీటిలో ఇప్పటికే రూ.43.15 కోట్ల విలువైన పనులు పూర్తి చేశారు. పాఠశాల పేరెంట్స్ కమిటీలకు ఆర్థిక భారం లేకుండా ముందస్తు పెట్టుబడిగా నిధులు ఇస్తుండటంతో పాటు జిల్లాలో ఇప్పటి వరకు చేసిన పనులకు పూర్తి స్థాయిలో బిల్లులు చెల్లించారు.

అదనపు గదులకు ప్రాధాన్యం

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా తరగతి గదుల నిర్మాణానికి అధిక ప్రాధాన్యమిచ్చారు. నాడు–నేడు మొదటి దశలో అభివృద్ధి చేసిన పాఠశాలలను సైతం పరిగణలోకి తీసుకుని అదనపు గదుల నిర్మాణం చేపట్టారు. జిల్లాలో 109 పాఠశాలల్లో చేపడుతున్న అదనపు గదుల నిర్మాణానికి రూ.57.95 కోట్లు కేటాయించారు. అలాగే అవసరమైన చోట్ల కాంపౌండ్ వాల్ నిర్మాణం సైతం చేపడుతున్నారు. ఇలా జిల్లాలోని 149 పాఠశాలలకు రూ.5.35 కోట్లు కేటాయించారు.

తాజాగా రూ.17.28 కోట్లు మంజూరు : జూన్ 12 నాటికి ఎట్టి పరిస్థితుల్లో శతశాతం పనులు పూర్తి చేయాలనే లక్ష్యం నిర్దేశించిన నేపథ్యంలో ఇందుకు అవసరమైన నిధులు సైతం కేటాయించింది. తాజాగా జిల్లాకు రూ.17.28 కోట్లు మంజూరు చేసింది. పాఠశాల పేరెంట్స్ కమిటీలతోనే నాడు–నేడు పనులు చేస్తున్నందున, వారిపై ఆర్థిక భారం లేకుండా ప్రభుత్వం ఎప్పటికప్పుడు రివాల్వింగ్ ఫండ్ మంజూరు చేస్తోంది. నిధులు అందుబాటులో ఉండటంతో యుద్ధ ప్రాతిపదికన పనులు పూర్తి చేసేలా ఇంజనీరింగ్ శాఖ అధికారులు దృష్టి సారించారు.

పనులపై ప్రత్యేక దృష్టి



వేసవి సెలవుల్లో పనులు వేగం పెంచేలా ప్రత్యేక దృష్టి సారించాం. నాడు–నేడు పనులకు నిధుల కొరత లేదు. వేసవి సెలవుల్లో తరగతుల నిర్వహణ ఉండదు కాబట్టి.. పనులకు ఎటువంటి ఆటంకం ఉండదు. ఉన్నతాధికారులు నిర్దేశించిన లక్ష్యం మేరకు పనులు పూర్తి చేసేలా క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న అధికారులు, సిబ్బందిని అప్రమత్తం చేశాం.

–డి.వి. నరసింహారావు, ఈఈ, సమగ్ర శిక్ష

మేము భాగస్వాములవుతున్నాం



బడులు బాగుండాలనే లక్ష్యంతో చేపడుతున్న ఈ కార్యక్రమంలో మేము కూడా భాగస్వాములవుతున్నాం. వచ్చిన నిధులను సద్వినియోగం చేసుకుని.. మా స్కూల్లో భవిష్యత్‌లో పెరిగే విద్యార్థుల సంఖ్యను కూడా దృష్టిలో పెట్టుకొని అదనపు గదులు నిర్మించుకుంటున్నాం. సిమెంట్, ఇసుక కొరత లేకుండా సకాలంలో సరఫరా చేస్తే.. విద్యా సంవత్సరం ప్రారంభం నాటికి కచ్చితంగా పనులు పూర్తవుతాయి.

– ఇమంది పైడిరాజు, హెచ్‌ఎం, జెడ్పీ హైస్కూల్, అడవివరం

వైద్య విద్యార్థుల మౌన దీక్ష

మహారాణిపేట : కేరళలో వైద్యుల సమ్మెకు మద్దతుగా, వైద్యురాలు వందనా దాస్ మృతికి సంతాపంగా గురువారం సాయంత్రం వైద్య విద్యార్థులు మౌన దీక్ష చేపట్టారు. తొలుత ఆంధ్రా మెడికల్ కాలేజీ నుంచి కేజీహెచ్ సూపరింటెండెంట్ కార్యాలయం వరకు ప్రదర్శన చేశారు. నల్ల రిబ్బన్లు ధరించి మౌన దీక్షలో పాల్గొన్నారు. విధి నిర్వహణలో ఉన్న వైద్యురాలు వందనా దాస్‌ను చంపిన వారిని కఠినంగా శిక్షించాలని, ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని ఏపీ జూనియర్ డాక్టర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కరుణా ప్రశాంత మామిడి కోరారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శులు ఎస్ఎండీ ఇలియాజ్ బాషా, డాక్టర్ చైతన్య కుమార్, ఉపాధ్యక్షులు డాక్టర్లు రోహిత్ దాసరి, ఎ.అఖిల్, దుర్గా మౌనిక తదితరులు పాల్గొన్నారు.